సాక్షి
సూర్యాపేట
ఆదివారం : 10 : సెప్టెంబర్ : 2023



సమ్మె బాటలో అంగన్‌వాడీలు

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు ఈ నెల 11 నుంచి సమ్మెకు సిద్ధమయ్యారు. - IVలో



వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తామని భువనగిరి ఎంపీ వెంకట్‌రెడ్డి అన్నారు. - IVలో



'జీ-20'లో జిగేల్.. తేలియా రుమాల్

ఢిల్లీలో జరిగే జీ-20 శిఖరాగ్ర సదస్సులో భారతీయ హస్తకళల ప్రదర్శనలో తేలియా రుమాల్‌కు చోటుదక్కింది. - IVలో

న్యూస్‌రీల్

అసెంబ్లీ ఎన్నికల కమిటీల్లో జిల్లా నేతలు

- మేనిఫెస్టో కమిటీలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి
- ఏఐసీసీ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కమిటీలో పద్మావతిరెడ్డికి చోటు



దామోదర్‌రెడ్డి, పద్మావతి, స్రవంతి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ కసరత్తు వేగవంతం చేసింది. ఈ మేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పలు కమిటీలను నియమించింది. అందులో ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలకు స్థానం కల్పించింది. మేనిఫెస్టో కమిటీలో 24 మందికి అవకాశం కల్పించగా అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డికి అవకాశం దక్కింది. ఏఐసీసీ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కమిటీలో కోదాడ మాజీ ఎమ్మెల్యే ఎస్.పద్మావతిరెడ్డి, మునుగోడు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రాపోలు జయప్రకాశ్‌కు చోటు దక్కింది. శిక్షణ కమిటీలో సూర్యాపేట నుంచి డాక్టర్ రవిబాబుకు అవకాశం కల్పించింది. స్ట్రాటజీ కమిటీలో పాల్వాయి స్రవంతికి చోటు కల్పించింది.

రైతులకు ఇబ్బందుల్లేకుండా యూరియా సరఫరా

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలోని రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేస్తామని కలెక్టర్ ఎస్.వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో యూరియా కొరత విషయాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రితో చర్చించడంతో వెంటనే జిల్లాకు వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించేలా చర్యలు తీసుకున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. త్వరలోనే జిల్లాకు యూరియా చేరుతుందని, యూరియా కొరత ఉన్న మండలాలకు అవసరాన్ని బట్టి సరఫరా చేస్తామని తెలిపారు. రైతులు అధైర్యపడొద్దని సకాలంలో యూరియా అందజేస్తామని పేర్కొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న నేతలు

సూర్యాపేట టౌన్: రానున్న ఎన్నికల లోపే రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఆరు రాష్ట్రాల్లో పాత పెన్షన్ పునరుద్ధరణ జరిగిందన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం నాయకులు సైదులు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నేడు జమియత్ ఉలేమాయే మహాసభ

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం జమియత్ ఉలేమాయే మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హఫీజ్ సాబీర్ తెలిపారు. శనివారం నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో దారుల్ ఉలూమ్ మజీద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జమియత్ సంస్థ నల్లగొండ అధ్యక్షుడు మౌలానా ఎహసానుద్దీన్ ఖాస్మీ, ఉపాధ్యక్షుడు ముఫ్తీ సయ్యద్ సిద్దిక్ అహ్మద్ మజాహిరి, ప్రధాన కార్యదర్శి మౌలానా అక్బర్‌ఖాన్ అసదీ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షకు సంఘీభావం



దీక్షలో కూర్చున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): విద్యా శాఖ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్ష శనివారం 6వ రోజుకు చేరింది. ఈ దీక్షలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

విగ్రహాలకు యమ గిరాకీ



కోదాడలో తయారవుతున్న వినాయకుడి విగ్రహాలు

ఎన్నికల వేళ.. గణపయ్య ప్రతిమలకు పెరిగిన డిమాండ్

- ఓట్ల కోసం యువకులను ఆకట్టుకునేందుకు నేతల ప్లాన్
- ఉచితంగా విగ్రహాలు ఇచ్చేందుకు హామీలు
- తయారీదారులకు వందల సంఖ్యలో ఆర్డర్లు ఇస్తున్న ఆశావహులు
- మండపాల ఏర్పాటుకూ ఆర్థికసాయం చేస్తామని భరోసా

కోదాడ: ఎన్నికల వేళ గణపయ్య విగ్రహాలకు భలే గిరాకీ ఏర్పడింది. కరోనా ప్రభావంతో గడిచిన రెండు సంవత్సరాలుగా నామమాత్రంగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించిన భక్తులు, యువకులు ఈ సంవత్సరం మాత్రం రెంట్టింపు స్థాయిలో వినాయక చవితి ఉత్సవాలు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీనికి కారణం కొద్ది రోజుల్లో జరిగే ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు ఉచితంగా విగ్రహాలను ఇవ్వడానికి ముందుకు రావడమే.. దీనికి తోడు మరికొందరు మండపాల ఏర్పాటుకు కూడా ఆర్థికసాయం చేస్తామని ఓట్ల కోసం యువకులను బుట్టలో వేసుకునే పనిలో పడ్డారు. ఇదిలా ఉంటే ఆశావహుల నుంచి వస్తున్న పోటీని తట్టుకోవడానికి ప్రధాన పార్టీల అభ్యర్థులు కూడా అంతోఇంతో సాయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

వందల సంఖ్యలో ఆర్డర్లు..

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నవారు ఇప్పటికే వివిధ రకాల ఫౌండేషన్ల పేరుతో నియోజకవర్గాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అందివస్తున్న ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుంటున్నారు. వినా యక విగ్రహాలు ఏర్పాటులో యువకులు ఉత్సాహంగా ఉంటారు కాబట్టి వారికి ఉచితంగా విగ్రహాలు ఇచ్చి వారిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు ఆశావహులు వందల సంఖ్యలో విగ్రహాలకు ఆర్డర్లు ఇచ్చారు. కోదాడకు చెందిన ఒకరు 150 విగ్రహాలకు ఆర్డర్ ఇవ్వగా, మరొకరు 200 విగ్రహాలకు ఆర్డరు ఇచ్చారు. మరో యువజన నేత 100 విగ్రహాలను హైదరాబాద్ నుంచి తెప్పించి గ్రామాల్లో పంచడానికి సిద్ధం చేసినట్లు సమాచారం. బీఎస్పీకి చెందిన మరో నేత 100 విగ్రహాలు ఇస్తానని యువకులకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఓజో ఫౌండేషన్ నిర్వాహకులు 450 విగ్రహాలకు ఆర్డర్ ఇచ్చినట్లు సమాచారం. సూర్యాపేట ఇక అధికార, ప్రతిపక్ష పార్టీకి చెందిన గ్రామ, మండల స్థాయి నాయకులకు కూడా విగ్రహాలు ఇవ్వాలని యువకుల నుంచి డిమాండ్ వస్తుండడంతో తప్పనిసరి పరిస్థితిలో విగ్రహాలకు హామీలు ఇస్తున్నారు. మరి కొంత మంది నేతలు విగ్రహాల డిమాండ్, చందాలకు బయపడి కుటుంబాలతో కలిసి యాత్రలకు వెళుతున్నారు. ఉత్సవాలు ప్రారంభమైన తరువాత తిరిగి వచ్చే విధంగా ప్లాన్ చేసుకుంటున్నారు.

ఈ సారి.. పోటాపోటీగా విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు

మరికొంత మంది ఆశావహులు విగ్రహంతో పాటు మండపం ఏర్పాటుకు కూడా అన్ని ఖర్చులు పెట్టుకుంటామని చెపుతూనే సదరు మండపం వద్ద తమ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో పాటు మండపం వద్ద జరిగే కార్యక్రమాల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని షరతులు పెడుతున్నట్లు యువకులు అంటున్నారు. ఇక నవరాత్రులలో జరిగే అన్నదాన కార్యక్రమాలు కూడా తమ చేతుల మీదుగా జరపాలని కోరుతున్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తమ బల ప్రదర్శనకు మండపాలను వేదికగా చేసుకోవడానికి ప్రయత్నిస్తుండడంతో ఈ సారి ప్రతి వీధిలో పోటాపోటీగా వినాయకుడి మండపాలను ఏర్పాటు చేసే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

ఇదే అదునుగా..

వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులతోపాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉత్సహంతో ఉన్న ఆశావహులు వినాయక విగ్రహాలకు పెద్ద ఎత్తున ఆర్డర్లు ఇస్తున్నారు. దీంతో విగ్రహాలకు డిమాండ్ పెరిగి కొరత ఏర్పడింది. ఇదే అదునుగా విగ్రహాల తయారీదారులు కూడా వాటి రేట్లను భారీగా పెంచేశారు. గత సంవత్సరం రూ.ఐదు వేలు ఉన్న విగ్రహం ధర ప్రస్తుతం రూ.పది వేలు చెపుతున్నట్లు భక్తులు అంటున్నారు. విగ్రహాలు ఉచితంగా ఇస్తుండడంతో యువకులు కూడా పెద్దవాటి కోసం నేతల వద్ద పట్టుపడుతున్నారు. ఎదుటి వారి కన్నా మనం పెద్ద విగ్రహం పెట్టాలని డిమాండ్ చేస్తుండడంతో నేతలు ఇదెక్కడి పంచాయితీరా బాబూ అంటూ గొణుక్కుంటున్నారు. తయారీదారులు మాత్రం మంచి భేరం మించిన దొరకదని సంబరపడిపోతున్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన జడ్జి రాజగోపాల్
- జిల్లా వ్యాప్తంగా 18,097 కేసులు పరిష్కారం



జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

చివ్వెంల: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికే జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా జిల్లా కోర్టులో 5 బెంచీలు ఏర్పాటు చేసి సివిల్, క్రిమినల్, మోటార్ వెహికల్, చెక్ బౌన్స్, గృహహింస, బ్యాంకులకు సంబంధించిన 8,170, అలాగే కోదాడలో 4,079, తుంగతుర్తిలో 2,966, హుజూర్‌నగర్‌లో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 2,882తో కలుపుకొని మొత్తం 18,097 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యాపేటలో ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న ఘర్షణలకు కోర్టు మెట్లెక్కకుండా అన్ని కేసులను రాజీ ద్వారా పరిష్కారించుకోవచ్చునన్నారు. దీనివల్ల ఇరువర్గాల కక్షిదారులు గెలిచిన వారవుతారని, సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటాయన్నారు. ప్రమాదాల్లో గాయపడి, ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు రూ.3.80 కోట్లు ఇన్సూరెన్స్ ఇప్పించామన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడిన కేసులు హైకోర్టులకు అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో మూడేళ్ల క్రితం విడిపోయి కోర్టు మెట్లు ఎక్కిన భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిని కలిపిన జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణిలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. లోక్‌అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు మధ్యాహ్న భోజన నిమిత్తం సూర్యాపేట సువెన్ ఫార్మసీ ఆధ్వర్యంలో సమకూర్చిన పులిహోర పొట్లాలు, మజ్జిగను న్యాయమూర్తుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్, జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, డీఎస్పీ నాగభూషణం, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పోలెబోయిన నర్సయ్య యాదవ్, జిల్లా లీగల్ సెల్ అథారిటీ సభ్యులు జె.శశిధర్, ఎడిండ్ల అశోక్, పీపీలు, లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

12న జిల్లా అదనపు న్యాయస్థానం ప్రారంభం

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ కోర్టులో ఈనెల 12న జిల్లా అదనపు న్యాయస్థానాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా ప్రధాన జడ్జి రాజగోపాల్ తెలిపారు. శనివారం ఆయన హుజూర్‌నగర్ కోర్టు హాల్‌లో జిల్లా అదనపు న్యాయస్థానం ప్రారంభోత్సవ ఏర్పాట్లను స్థానిక న్యాయమూర్తులు జిట్టా శ్యాం కుమార్, మారుతీప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం జాతీయ మెగాలోక్ అదాలత్ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ జగదీశ్‌రెడ్డి, డీఎస్పీ ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు, సీఐ రామలింగారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ శివకుమార్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.



విడిపోయిన భార్యాభర్తలను కలుపుతున్న సూర్యాపేట కోర్టు న్యాయమూర్తులు



హుజూర్‌నగర్ : న్యాయమూర్తులతో చర్చిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్నాం

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న అదనపు కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునే విధంగా స్వీప్ కార్యక్రమం ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని అదనపు కలెక్టర్ ఏ.వెంకట్‌రెడ్డి తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం సూర్యాపేటలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందించి మాట్లాడారు. ఓటు ఆవశ్యకతను తెలిపేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావు సూచనల మేరకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మహిళా సంఘాలు, గ్రామీణ ప్రజలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో కోదాడకు చెందిన పద్మావతికి ప్రథమ బహుమతి, హుజూర్‌నగర్‌కి చెందిన విజయకుమారి ద్వితీయ బహుమతి, సూర్యాపేటకు చెందిన సాయిశ్రీకి తృతీయ బహుమతి లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ వీరబ్రహ్మచారి, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎన్నికల సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మరో నాలుగు నెలలు గడువు

- ఉపాధి కూలీల ఆధార్ అనుసంధానానికి డిసెంబర్ వరకు అవకాశం
- ఇప్పటి వరకు 99.93 శాతం నమోదు ప్రక్రియ పూర్తి
- జిల్లాలో 3,49,176 మంది కూలీలు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఉపాధి హామీ కూలీల ఆధార్ అనుసంధానానికి ప్రభుత్వం మరో నాలుగు నెలలు గడువు పెంచింది. కూలీలకు ఈ నెల 1నుంచి అమలయ్యే ఆధార్ ఆధారిత వేతనాల చెల్లింపు గడువును డిసెంబరు వరకు అధికారులు పొడిగించారు. జాతీయ స్థాయిలో కొద్ది నెలలుగా కూలీల బ్యాంకు ఖాతాలను ఆధార్‌కు అనుసంధానిస్తున్నారు. వివిధ కారణాలతో 100 శాతం నమోదు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ఆధార్ సీడింగ్ 99.93 శాత పూర్తి..

జిల్లాలో ఆధార్ అనుసంధాన నమోదు ప్రక్రియ దాదాపు 99.93 శాతం పూర్తయింది. వానాకాలం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండడంతో కూలీల హాజరు కూడా అంతంత మాత్రంగానే ఉంది. జిల్లాలో మొత్తం 3,49,176 మంది కూలీలకు గాను ఇప్పటి వరకు 3,48,949 మంది ఆధార్ వివరాలను నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) పోర్టల్లో నమోదు చేశారు. వివిధ కారణాలతో కేవలం 227 మంది కూలీల ఆధార్ నమోదు కాలేదు.

పారదర్శకత పెంపునకే..

ఉపాధి హామీలో మొదట్లో తపాలా శాఖ నుంచి కూలీలకు వేతనాలు పంపిణీ చేసేవారు. బీపీఎంలు (బ్రాంచ్ పోస్టు మాస్టర్లు) కూలీల పేరిట వేతనాలు స్వాహా చేయడంతో ఈ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. కొన్నాళ్ల తర్వాత కూలీల బ్యాంకు, తపాలా ఖాతాల నుంచి నేరుగా వేతనాలు విడుదల చేస్తోంది. దీంతో అక్రమాలకు కొంత అడ్డుకట్ట పడినట్లయింది. జాతీయ స్థాయిలో వేతన చెల్లింపుల్లో పారదర్శకత పెంచేందుకు ఖాతాలతో ఆధార్ అనుసంధాన ప్రక్రియకు తెర తీశారు. అయితే ఆధార్ కార్డులేని కూలీలు ఉపాధి కోల్పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సమస్యలపై దృష్టి

జిల్లాలో కొందరు కూలీల బ్యాంకు ఖాతాలు మనుగడలో లేవు. మరికొన్ని చోట్ల జాబ్‌కార్డు, ఆధార్‌లో పేర్లు వేర్వేరుగా ఉన్నాయి. ఇవి ఆధార్ అనుసంధాన ప్రక్రియకు అడ్డంకిగా మారాయి. ఇలాంటి వాటిని జిల్లా స్థాయిలో అధికారులు గుర్తిస్తున్నారు. గ్రామాల వారీగా కూలీల వివరాలు సేకరించి సవరించే పనిలో నిమగ్నమయ్యారు. ఆధార్ గడువు కూడా పొడిగించడంతో కూలీల ఉపాధికి అడ్డంకులు తొలగిపోయాయి. డిసెంబర్ వరకు గడువు విధించడంతో ఆధార్ నమోదును సంపూర్ణం చేసేందుకు అధికారులు కూడా సిద్ధమవుతున్నారు.

నేరుగా ఖాతాల్లోకి వేతనాలు

జాతీయ స్థాయిలో ఎన్‌పీసీఐ విధానంలో భాగంగా ఆధార్ బ్రిడ్జ్ పేమెంట్ సిస్టమ్ (ఏబీపీఎస్) అమలు చేస్తున్నారు. బ్యాంకు, తపాలా శాఖల్లోని కూలీల ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానిస్తున్నారు. ఈ పోర్టల్లో నమోదు ఉంటేనే కూలీలకు పని కల్పిస్తారు.

గడువులోగా వందశాతం పూర్తి చేస్తాం

జిల్లాలో కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం దాదాపు పూర్తయింది. కేవలం 0.7 శాతం మాత్రమే మిగిలి ఉంది. ఇందుకు కారణాలు తెలుసుకుంటున్నాం. గడువులోగా శత శాతం అనుసంధానించేలా చర్యలు తీసుకుంటాం.

– కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ, సూర్యాపేట

పల్లెల్లో పారదర్శక పాలనకు..

ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్‌ను ప్రవేశపెట్టిన కేంద్రం

- చేపట్టిన పనులు, నిధుల ఖర్చు వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది
- అవకతవకలు లేకుండా సాగుతున్న ఆడిటింగ్



దురాజ్‌పల్లి (సూర్యాపేట): గ్రామ పంచాయతీల పాలనా వ్యవహారాల్లో పారదర్శకత కోసం, ప్రజలు సులభంగా అన్ని విషయాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్‌ను తీసుకొచ్చింది. 2020లోనే ఈ యాప్ అందుబాటులోకి వచ్చినా దాన్ని ఇటీవల మరింతగా తీర్చిదిద్ది అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఎందుకింత ప్రాధాన్యం?

చాలాచోట్ల పంచాయతీ పాలకవర్గాలు చేస్తున్న నిధుల ఖర్చు తెలుసుకోవడానికి సమాచార హక్కు చట్టాన్నే వినియోగించుకుంటున్నారు. ఆ చట్టం మంచిదే అయినా అడిగిన సమాచారం తీసుకోవటానికి కొంత సమయం పడుతుంది. కొన్ని సందర్భాల్లో కోరిన వివరాలు ఇవ్వని పక్షంలో పైఅధికారుల వద్దకు వెళ్లాలి. సమాచారం పొందే క్రమంలో అందుకయ్యే వ్యయాన్ని కూడా భరించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మన అర చేతిలో అర క్షణంలో ఏ గ్రామ పంచాయతీ వివరాలు కావాలనుకుంటే ఆ వివరాలు, నిధులు, వ్యయ వివరాలు సులభంగా తెలుసుకునేలా కేంద్ర ప్రభుత్వం ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్‌నకు రూపకల్పన చేసింది. అయితే పంచాయతీల నిర్వహణ, అభివృద్ధి కోసం జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంస్థ ద్వారా నిధులను విడుదల చేస్తోంది. వీటికి తోడు పంచాయతీలకు వివిధ పన్నుల ద్వారా కొంత నిధి జమ అవుతూ ఉంటుంది. ఈ నిధులను 25 శాతం పారిశుద్ధ్య నిర్వహణకు, 25 శాతం తాగునీటి సరఫరా, విద్యుత్ బిల్లుల చెల్లింపులకు, 50 శాతం నిధులను పంచాయతీల నిర్వహణ, వివిధ అభివృద్ధి పనులు చేసేందుకు వినియోగించాలి. ఈ నిబంధనలు ఎప్పటినుంచో ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా అమలు చేయగా తక్కువ పనులు చేసి ఎక్కువ బిల్లు తీసుకోవడం, అక్రమాలకు పాల్పడడం వంటివి జరిగేవి. పంచాయతీల నిర్వహణపై పారదర్శకత ఉండేది కాదు. ఈ యాప్ అమలుతో అవకతవకలు నివారించే అవకాశం ఉండడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

475 పంచాయతీలలో అమలు..

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే అన్ని పంచాయతీలోనూ ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్ అమలులోకి వచ్చింది. ఈ పంచాయతీలకు వస్తున్న నిధులు, చేస్తున్న వ్యయం, చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి ఎప్పటికప్పుడు సంబంధిత కార్యదర్శులు యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆడిటింగ్ నిర్వహణ కూడా సక్రమంగా జరుగుతోంది. గతంలో పంచాయతీల్లో నిర్వహించే ఆడిటింగ్‌ల ద్వారా అనేక అభ్యంతరాలను ఆడిటర్లు వ్యక్తం చేసేవారు. వారితో కుమ్మక్కై అభ్యంతరాలు లేకుండా చేసుకునేవారు. కానీ ఈ-గ్రామ్ స్వరాజ్ యాప్ వచ్చిన తర్వాత గతంలో మాదిరిగా అవకతవకలు, అక్రమాలకు ఆస్కారం లేకుండా ఉండే అవకాశం కలిగింది.

మూడేళ్ల క్రితమే..

పంచాయతీలకు ఇస్తున్న నిధుల వ్యయంపై కొరవడిన జవాబుదారీ తనాన్ని కాపాడేందుకు, పంచాయతీల్లో పాలన పారదర్శకంగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల కిత్రం అనగా 2020 ఏప్రిల్ 24న 'ఈ-గ్రామ్ స్వరాజ్' యాప్‌ను తీసుకొచ్చింది. దీనిని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈ యాప్‌లో పంచాయతీలకు వివిధ పద్దుల ద్వారా వస్తున్న నిధులు ఎన్ని, వీటితో ఏయే పనులు చేయాలి, సిబ్బంది జీతభత్యాల చెల్లింపులు, పంచాయతీల నిర్వహణ ఖర్చులు, ఏ పనికి ఎన్ని నిధులు ఖర్చు చేశారు, పాలకవర్గాల సమాచారం తదితర వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. దేశంలోని అన్ని గ్రామ పంచాయతీల వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. గూగుల్ ప్లేస్టోర్ నుంచి 'ఈ-గ్రామ్ స్వరాజ్' యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ పేరును క్లిక్ చేయగానే వివరాలు అన్ని కనిపిస్తాయి. ఈ యాప్ వచ్చినప్పటి నుంచి పంచాయతీ పాలక వర్గాలు, కార్యదర్శులు నిధులను ఎడాపెడా ఖర్చు చేయకుండా ఒక పద్ధతి ప్రకారం నడుచుకుంటున్నారు.

సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ : పల్లా

నల్లగొండ టౌన్ : భూమి, భుక్తి, విముక్తి కోసం దొరలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ మతంరంగు పులిమి వక్రీకరించడం సిగ్గుచేటని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలు దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ అమరత్వంలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి మగ్దూం మోహినుద్దీన్ పిలుపునందుకుని నిజాంకు వ్యతిరేకంగా పోరాటం సాగించారని గుర్తు చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. గురిజ రామచంద్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పల్లా నర్సింహారెడ్డి, లొడంగి శ్రవన్ కుమార్, ఉజ్జిని యాదగిరిరావు, బొడ్డుపల్లి వెంకటరమణ, బంటు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న బోడ శ్రీరాములు మాదిగ

భానుపురి (సూర్యాపేట): ఈనెల 18నుంచి 22వ తేదీ వరకు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, లేదంటే మాటిచ్చి తప్పిన బీజేపీ నాయకులను గ్రామాల్లో తిరగకుండా అడ్డుకుంటామని మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బోడ శ్రీరాములు మాదిగ అన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టల మల్లేష్, పట్టణ ఇన్‌చార్జి దైద వెంకన్నల అధ్యక్షతన చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ దీక్షలకు మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు అమరారపు పద్మభూషణ్, నాయకులు రవీందర్, ప్రసాద్‌లు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జాతీయ సమన్వయకర్త చింతలపాటి చిన్నశ్రీరాములు, పట్టణ అధ్యక్షుడు బొజ్జ వెంకన్న, సూర్యాపేట మండల అధ్యక్షుడు తాటిపాముల నవీన్, పిడమర్తి శంకర్, దాసరి వెంకన్న, చింతలచెరువు శంకర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం

ఆత్మకూర్ (ఎస్) (సూర్యాపేట): ఆత్మకూర్ మండల పరిధిలోని ఏపూరు గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. గ్రామానికి చెందిన గుండ్లపల్లి వెంకన్న కుమార్తె భవాని (21)కి తడకమళ్ల గ్రామానికి చెందిన బాదర బోయిన కోటయ్యతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఈనెల 7వ తేదీన భర్తతో గొడవపడిన భవాని అదే రోజు రాత్రి ఏపూరుకు తన తల్లిగారింటికి వచ్చింది. 8న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఇప్పటి వరకు ఆచూకీ లేకపోవడంతో తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు.

108 వాహనంలో గర్భిణి ప్రసవం



మగబిడ్డకు జన్మనిచ్చిన యస్మీనాబేగం

తిరుమలగిరి (నాగార్జునసాగర్): గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. తిరుమలగిరి మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన షేక్ యస్మీనాబేగంకు శనివారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. సిబ్బంది గ్రామానికి చేరుకొని యస్మీనాబేగాన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మగబిడ్డకు జన్మనిచ్చింది. చికిత్స నిమిత్తం తల్లీబిడ్డను మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి



చాట్ల తిరుపతి వెంకయ్య (ఫైల్)

మేళ్లచెరువు: ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీ కొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మేళ్లచెరువు మండలంలోని రామాపురం పరిధిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాపురం గ్రామానికి చెందిన చాట్ల తిరుపతి వెంకయ్య (30) స్థానిక సిమెంట్ పరిశ్రమలో రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. రైలును గమనించకుండా సెల్‌ఫోన్ మాట్లాడుతూ ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు రైల్వే పోలీసులకు తెలిపారు. మృతుడి భార్య శిరీష గర్భిణి కాగా ఒక కుమారుడు ఉన్నారు.

మట్టపల్లిలో కృష్ణాష్టమి పూజలు

మఠంపల్లి: శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం మట్టపల్లి శ్రీలక్ష్మినరసింహస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పెదవీడుకు చెందిన యాదవులచే ఆలయ ఆవరణలో నిర్వహించిన ఉట్లు కొట్టే కార్యక్రమం అలరింపజేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయకుమార్, ఈఓ నవీన్, అర్చకులు, యాదవులు, భక్తులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- సూర్యాపేట, నడిగూడెం, భువనగిరి మండలాల్లో ఘటనలు

సూర్యాపేట క్రైం: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. సూర్యాపేట, నడిగూడెం, భువనగిరి మండలాల్లో జరిగిన ఘటనల వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేటలోని శాంతినగర్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం దురాజ్‌పల్లి నుంచి వరిపొట్టు లోడ్‌తో బీబీగూడెం వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రాలీపై కూర్చున్న చివ్వెంల మండలం పాండ్యానాయక్ తండాకు చెందిన భద్రమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందింది. అదే ట్రాలీపై కూర్చున్న మంగమ్మ, లునావత్ భీమాతో పాటు ట్రాక్టర్ డ్రైవర్ ధరావత్ హట్టీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ టైరు పేలి అదుపుతప్పడంతో..



మృతి చెందిన సతీష్

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీలకంఠం సతీష్ (31) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి తన స్నేహితుడికి చెందిన ద్విచక్రవాహనంపై ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడేనికి తన వ్యక్తిగత పనిమీద వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ టైరు పేలి, వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. దీంతో సతీష్ తలకు, చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని..



తేజ్ (ఫైల్)

భువనగిరి: భువనగిరి పట్టణంలోని రాంనగర్‌కు చెందిన రాచమల్ల తేజ్ (26) డ్రైవింగ్‌తో పాటు శుభకార్యాలకు డేకరేషన్ చేస్తుంటాడు. ఉదయం తన సొంత పని నిమిత్తం రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వలిగొండ నుంచి భువనగిరి వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధీర్ కృష్ణ తెలిపారు.

చోరీ కేసులో నిందితుల రిమాండ్

ఆత్మకూరు(ఎం): మండలంలోని తుక్కాపురంలో ఈ నెల 4న పొనగాని స్వామి ఇంట్లో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఆదేశాల మేరకు డీసీపీ రాజేష్ చంద్ర, ఏసీపీ మొగిలయ్య, సీఐ మోతీరామ్ నేతృత్వంలో ఆత్మకూరు(ఎం) ఎస్‌ఐ నాగరాజుతో పాటు పోలీసులు నాలుగు రోజులపాటు తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తచ్చాడుతూ తిరుగుతుండగా పోలీసులకు అనుమానం రావడంతో పట్టుకున్నారు. విచారణ అనంతరం నిందితులు నేరం అంగీకరించారు. నిందితులు భద్రాది కొత్తగూడెం జిల్లాకు చెందిన గుమ్మడి రాంబాబు, అతని భార్య లలితగా గుర్తించారు. సంఘటనకు రెండు రోజుల ముందు భార్య లలిత గ్రామంలో రెక్కీ నిర్వహించి సమాచారం అందజేయడంతో భర్త గుమ్మడి రాంబాబు చోరీకి పాల్పడి 12తులాల బంగారు పుస్తెలతాళ్లు, రూ. 25వేల నగదును అపహరించుకుపోయాడు. ఈ నగదు, సొమ్మును పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు పంపించారు. చాకచక్యంగా వ్యవహరించి సకాలంలో నిందితులను పట్టుకున్నందుకు ఆత్మకూరు(ఎం) ఎస్‌ఐ నాగరాజును, పోలీస్ సిబ్బందిని డీసీపీ రాజేష్‌చంద్ర అభినందించారు.

డీజిల్ దొంగల అరెస్టు

భువనగిరి: ఆగి ఉన్న లారీల్లో డీజిల్ దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి పట్టణ సీఐ సుధీర్ తెలిపారు. ఈ నెల 7న పట్టణంలోని బైపాస్ రోడ్డు మార్గంలో సింగన్నగూడెం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఆగి ఉన్న లారీ డీజిల్ ట్యాంకర్ తాళం తెరిచి సుమారు 245 లీటర్ల డీజిల్‌ను క్యాన్లలో నింపుకుని పారిపోయారు. లారీ యాజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శనివారం ఉదయం అందిన సమాచారం మేరకు స్థానిక డాల్ఫిన్‌హోటల్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. నారాయణపేట జిల్లాకు చెందిన అంగోతు రమేష్, పాల్తీయ సురేందర్‌లు వాహనంలో హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వస్తున్నారు. అనుమానంతో వారిని పట్టుకుని విచారించగా చేసిన దొంగతనాలను అంగీకరించారు. కాగా.. రమేష్, సురేందర్‌లు చిన్నప్పటి నుంచి స్నేహితులు. వీరు క్యాబ్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వస్తున్న ఆదాయం సరిపోక డీజిల్ చోరీ చేసి, డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా 2018లో మహబూబ్‌నగర్‌రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీ నుంచి డీజిల్ దొంగతనం చేసిన కేసులో జైలుకు వెళ్లి వచ్చారు. అనంతరం మక్తల్‌లో నార్వ, కొత్తపేట ఓల్డ్ స్టేషన్ల పరిధిలో చేసిన దొంగతనం కేసు విషయంలో కూడా జైలుకు వెళ్లారు. భువనగిరిలో జరిగిన దొంగతనం కేసులు రమేష్, దీరావత్ రవినాయక్‌తో పాటు సురేందర్‌లు చోరీ చేసిన డీజిల్‌ను హైదరాబాద్‌లోని బోరబండలో అన్వర్ అనే వ్యక్తికి విక్రయించారు. రమేష్, సురేందర్‌లను పట్టుకుని, వారి నుంచి రూ.14 వేల నగదు, కారు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

శిక్షణ కాలం సంతృప్తినిచ్చింది

ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ



శివం ఉపాధ్యాయను సన్మానిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది

బొమ్మలరామారం: బొమ్మలరామారంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన శిక్షణా సమయం తనకు సంతృప్తిని ఇచ్చిందని ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ అన్నారు. ఐపీఎస్ ట్రైనింగ్‌లో భాగంగా ఆయన మూడు నెలల శిక్షణ కాలం పూర్తి చేసుకుని తదుపరి శిక్షణకు పోలీస్ అకాడమీకి వెళ్తున్నారు. ఈసందర్భంగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో శివం ఉపాధ్యాయ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన సమయంలో మండలంలో చోటు చేసుకున్న రెండు భారీ నగదు చోరీ కేసులతోపాటు మరో రెండు ప్రాపర్టీ దొంగతనం కేసులను 24 గంటల్లో చేదించానన్నారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని విభాగాలను అధ్యయనం చేసినట్లు తెలిపారు. మండలంలో క్రిమినల్ కేసుల నమోదు తక్కువగా ఉందని పేర్కొన్నారు. శిక్షణా సమయంలో స్థానిక ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డితో పాటు సిబ్బంది సహకారం చాలా బాగుందన్నారు. మండల ప్రజలు మనోభావాలను సైతం అధ్యయనం చేశానన్నారు. ప్రజలకు సత్వర న్యాయం చేయాలంటే లా అండ్ ఆర్డర్ నియంత్రించే పోలీస్ శాఖతోనే సాధ్యమని చెప్పారు. మరో ఐదు నెలల శిక్షణ అనంతరం ఎస్పీగా విధుల్లో చేరనున్నట్లు వెల్లడించారు. 28 సంవత్సరాల వయసులోనే ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్‌ఐలు కృష్ణ, చంద్రమ్మ, అంజయ్య, మధు, నాగార్జున, జనార్దన్, సతీష్, శ్రీను పాల్గొన్నారు.

కోర్టు కేసులో రాజీపడినందుకు దాడి

- ఒకరు మృతి



లక్ష్మయ్య (ఫైల్)

వలిగొండ : కోర్టు కేసులో రాజీ పడినందుకు ఓ వ్యక్తిపై దాడి చేసి హత్య చేసిన ఘటన వలిగొండ మండలంలోని గోకారంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైరు లక్ష్మయ్య(55) తన కుటుంబానికి, పాలి వారైన చిన్న లక్ష్మయ్యకు ఉన్న ఓ వివాదం కేసులో ఇటీవల కోర్టులో రాజీ పడ్డాడు. దీంతో వరుసకు తమ్ముని కొడుకైన బైరు రామస్వామి, ఆయన భార్య రమ్య, తల్లి సిద్ధమ్మతో కలిసి శనివారం రాత్రి లక్ష్మయ్య ఇంటికి వెళ్లాడు. తమకు తెలియకుండా కోర్టులో ఎలా రాజీ పడతారని టీవీ చూస్తున్న లక్ష్మయ్య కోడలు శైలజను దూషించి దాడి చేశారు. ఈక్రమంలో వారిని అడ్డుకునేందుకు వెళ్లిన బైరు లక్ష్మయ్యపై ఈ ముగ్గురు కలిసి దాడి చేశారు. అతడి చాతిపై బలంగా కొట్టడంతో కిందపడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రామన్నపేట సీఐ మోతీరాం ఆధ్వర్యంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని పాదయాత్ర



కట్టంగూర్‌లో అల్లం రామారావుకు స్వాగతం పలుకుతున్న జెడ్పీటీసీ బలరాములు

కట్టంగూర్: కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ అల్లం రామారావు భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు పాదయాత్ర చేపట్టారు. ఈనెల 1వ తేదీన చేపట్టిన యాత్ర శనివారం కట్టంగూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు ఆయనకు స్వాగతం పలికారు. అల్లం రామారావు మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛన్ పెంచిన నేపథ్యంలో కృతజ్ఞతలు తెలుపుతూ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. స్వాగతం పలికిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు గాదపాక కన్నయ్య, చిగుళ్ల సైదులు, కటికం శ్రీను ఉన్నారు.

వివాదాస్పదంగా పంచాయతీ నూతన భవన స్థలం



గ్రామ పంచాయతీ భవనం కోసం పల్లె ప్రకృతి వనంలో తొలగించిన చెట్లు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం జంగారెడ్డి గూడెంలో గ్రామ పంచాయతీ భవనం కోసం గుర్తించిన స్థలం వివాదాస్పదంగా మారింది. గ్రామానికి నూతన పంచాయతీ భవనం మంజూరైంది. ప్రస్తుతమున్న భవన స్థలం తక్కువగా ఉన్నందున గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో స్థలాన్ని గుర్తించారు. అంతేకాకుండా అక్కడ ఉన్న చెట్లను సైతం తొలగించారు. అయితే గ్రామస్తులను సంప్రదించకుండా సర్పంచ్, ఎంపీడీఓ స్థలాన్ని గుర్తించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో ముగ్గు పోసేందుకు డీఈ నాగయ్య, సిబ్బందితో కలిసి శనివారం గ్రామానికి రావడంతో వేరే చోట ప్రభుత్వ స్థలం ఉండగా పల్లె ప్రకృతి వనంలో చెట్లను నరికి భవనాన్ని నిర్మించడమేంటని స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయమై ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి వివరణ కోరగా వేరే చోట స్థలం లేకపోవడంతో పల్లె ప్రకృతి వనంలో పంచాయతీ భవనానికి స్థలం గుర్తించామని తెలిపారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి వేరే చోట ప్రభుత్వ భూమిని గుర్తిస్తామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

హాలియా: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హాలియా పట్టణంలో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలకు ప్రభుత్వం చాలీచాలని వేతనాలు ఇచ్చి వెట్టిచాకిరి చేయించుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. సుప్రీ కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కి రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు చెల్లించాలని, ప్రమాద బీమా రూ.5లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెలోకి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు అంబటి మణెమ్మ, సుగుణమ్మ, రాజేశ్వరీ, పద్మలత, వజ్రమ్మ, విజయ, కృష్ణవేణి సైదమ్మ, పద్మ తదితరులు ఉన్నారు.

కాళోజీని ఆదర్శంగా తీసుకోవాలి



కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శనివారం కాళోజీ 109వ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఎంజీయూ తెలుగు విభాగం అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు అధ్యాపకుడు సత్యనారాయణ మాట్లాడుతూ కాళోజీ ప్రజాకవిగా రాణించారని తెలిపారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అధ్యాపకురాలు అనిత కుమారి మాట్లాడుతూ స్త్రీ అభ్యున్నతికి కాళోజీ ఎంతో కృషి చేశారన్నారు. తెలంగాణ మాండలికాన్ని తన రచనల ద్వారా ప్రజలకు తెలియజేశారని పేర్కొన్నారు.

అన్నెపర్తి బెటాలియన్‌లో..

అన్నెపర్తి 12 వ బెటాలియన్‌లో కాళోజీ చిత్రపటానికి బెటాలియన్ కమాండెంట్ ఎన్వీ సత్య శ్రీనివాస్‌రావు నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు వెంకన్న, శ్రీనివాస్, యుగేందర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ సేవలు మరవలేనివి



కాళోజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

హాలియా: ప్రముఖ ప్రజా కవి కాళోజీ నారాయణరావు సమాజానికి చేసిన సేవలు మరవలేనివని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా సైదులురావు గౌతమ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మూడావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా శనివారం అనుముల మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో మూడావత్ జగన్‌బాబు(ఐఆర్‌ఎస్), కందుల మదన్‌రెడ్డి, మేగావత్ లోక్‌నాథ్, కందుల నారాయణరెడ్డి, మేగావత్ మంగ్యానాయక్, రమావత్ సర్దార్, బాణావత్ దీప్లా తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేత



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తేజస్వీనిఖిల్

తుర్కపల్లి : మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత, బీఆర్‌ఎస్ నాయకుడు గట్టు తేజస్వీనిఖిల్ శనివారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ తమిళిసైని కలిశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించడానికి కలిసినట్లు ఆయన విలేకరులకు తెలిపారు.

'యాదాద్రి'లో ఉట్లోత్సవం



యాదాద్రి ఆలయ తూర్పు రాజగోపురం ఎదుట నిర్వహించిన ఉట్లోత్సవంలో పాల్గొన్న ఈఓ గీతారెడ్డి, దేవస్థాన సిబ్బంది తదితరులు



శ్రీకృష్ణుడి అలంకరణలో స్వామి అమ్మవార్లని ఉట్లోత్సవానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్చకులు, ఆలయాధికారులు



ప్రధానాలయ వీధుల్లో భక్తుల రద్దీ



రుక్మిణీ కల్యాణ వేడుకలో పాల్గొన్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి



తూర్పు రాజగోపురం ఎదుట ఉట్లోత్సవాన్ని తిలకిస్తున్న ఆలయాధికారులు, భక్తులు